రైతుబజార్ కల త్వరలో సాకారం

- తుది దశకు ఆరిలోవ రైతుబజార్ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ప్లాస్టింగ్ పనులు జరుగుతున్న కార్యాలయం, స్టోర్ రూం, ఆర్వో ప్లాంట్ గదులు



రైతుబజార్‌లో నిర్మించిన షాపులు

ఆరిలోవ: రైతుబజార్ కోసం ఆశగా ఎదురు చూస్తున్న ఆరిలోవ ప్రాంతవాసుల కల త్వరలో సాకారం కానుంది. నెల రోజుల్లో అందుబాటులోకి రానుంది. తోటగరువు దరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనక అరెకరం స్థలంలో చేపట్టిన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. విశాలాక్షినగర్, హనుమంతవాక నుంచి ఇటు పైనాపిల్‌కాలనీ, ఆరిలోవ కాలనీ, తోటగరువు వరకు ఈ రైతుబజార్ అందుబాటులో ఉంటుంది. ఆరిలోవ ప్రాంతం విశాలమైంది. జీవీఎంసీ 10వ వార్డు నుంచి 13వ వార్డు వరకు నాలుగు వార్డులు పరిధిలో లక్షకు పైగా జనాభా ఉన్నారు. డెయిరీఫారం, ఇందిరానగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, బాలాజీనగర్, టీఐసీ పాయింట్, ఆరిలోవ కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీతో పాటు కొండవాలు ప్రాంతాలైన హనుమంతవాక పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర ఉన్న విశాలమైన ప్రాంతమిది. కానీ ఇంతవరకు ఈ ప్రాంతంలో రైతుబజార్ లేకపోవడంతో ప్రజలు కూరగాయల కోసం ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆరు కిలోమీటర్లకు పైగా దూరం ఉన్న ఎంవీపీ రైతుబజార్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడికి నేరుగా సిటీ బస్‌లు కూడా లేవు. వెంకోజీపాలెం వరకు ఒక బస్సెక్కి, అక్కడి నుంచి మరో బస్సు లేదా ఆటో ఎక్కాల్సి ఉంటుంది. లేదంటే ఆటో బుక్ చేసుకోవాల్సిందే. రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారం ప్రాంతాల వారిదీ ఇదే పరిస్థితి. ఇన్ని ఇబ్బందులు పడి వెళ్లలేని వారు స్థానిక బజార్లలో అధిక ధరకు కూరగాయలు కొనాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ రైతుబజార్ అందుబాటులోకి వస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

అరెకరం స్థలంలో నిర్మాణం

తోటగరువు దరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనక రెవెన్యూకు చెందిన అరెకరం స్థలాన్ని అధికారులు రైతుబజార్ కోసం కేటాయించారు. ఈ స్థలంలో మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్మాణ పనులు చేపట్టారు. దీని కోసం రూ.80 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇక్కడ 48 స్టాళ్లు నిర్మిస్తున్నారు. వాటిలో రైతులు, డ్వాక్రా మహిళలు కూరగాయలు, ఆకు కూరలు విక్రయించడానికి 38 స్టాళ్లు, 5 కిరాణ షాపులతో పాటు ఈవో కార్యాలయం, స్టోర్ రూం, వాచ్‌మన్ గది, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది నిర్మించారు. ఈ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. దీంతో ప్రారంభోత్సవానికి మేయర్, మార్కెటింగ్ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నెల రోజుల్లో అందుబాటులోకి..



తోటగరువు వద్ద నిర్మిస్తున్న రైతుబజార్ నెల రోజుల్లో అందుబాటులోకి తీసుకురానున్నాం. దీని కోసం మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడాం. ఇక్కడ షాపులు నిర్మాణం జరిగి సిద్ధంగా ఉన్నాయి. ఈవో కార్యాలయం, వాచ్‌మన్ గది, స్టోర్ రూం, మరుగుదొడ్ల నిర్మాణ పనులు కొద్ది శాతం మిగిలి ఉన్నాయి. వాటిని త్వరగా పూర్తి చేయించే చర్యలు తీసుకుంటున్నాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం, వార్డుల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు గెలవడంతో పట్టుపట్టి రైతుబజార్ సాధించుకున్నాం. దీంతో ఆరిలోవ ప్రజల ఆశ నెరవేరనుంది.

– గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ మేయర్,

నాణ్యమైన భోజనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం



హాస్టల్ ఉద్యోగులతో మాట్లాడుతున్న చీఫ్ వార్డెన్ వీర్రాజు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే దిశగా సిబ్బంది చిత్త శుద్ధితో పని చేయాలని చీఫ్ వార్డెన్ డాక్టర్ జి.వీర్రాజు అన్నారు. హాస్టల్ కార్యాలయంలో ఆయన ఉద్యోగులతో సమావేశమయ్యారు. ప్రధానంగా మెస్ పరిసరాలు, వంట శాలలో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉద్యోగులు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పని చేయాలని చెప్పారు. విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడమే లక్ష్యంగా ప్రతి వ్యక్తి పని చేయాలన్నారు. ఉద్యోగులకు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే సత్వరం పరిష్కరిస్తామన్నారు. సమష్టిగా పని చేస్తూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవసరమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని తీర్చిదిద్దాలన్నారు.

స్టోర్స్ నిర్వహణ, కిరాణా, కూరగాయలు వంటివి నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. హాస్టళ్లకు వచ్చే నిత్యావసర వస్తువుల్లో నాణ్యత లోపం ఉంటే తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ నిర్దేశించిన విధంగా హాస్టళ్లకు కిరాణా వస్తువులు, కూరలు వంటివి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్‌లు రమణ మూర్తి, బుజ్జిబాబు, హాస్టల్ కార్యాలయం సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.

దశ దిన సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

దాబాగార్డెన్స్: సంస్కృత భారతి ఆధ్వర్యంలో రాంనగర్‌లో గల విశాఖ సేవా సదన్ పాఠశాలలో మంగళవారం దశ దిన సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభమైంది. ప్రముఖ న్యాయవాది సత్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. సంస్కృత ప్రాముఖ్యతను వివరించారు. శిబిరం నిర్వహిస్తున్న సంస్కృత భారతిని అభినందించారు. అనంతరం సంస్కృత భారతి ఆంధ్ర ప్రాంత సంపర్క్ ప్రముఖ్ ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ పది రోజుల్లో సులభంగా సంస్కృతం మాట్లాడడంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సంస్కృతం తెలయడం వల్ల మిగిలిన భాషలు సులభంగా మాట్లాడగలమని చెప్పారు. ఈ నెల 25 వరకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. వయసుతో పని లేదని, ఆసక్తి గల వారు ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి డాక్టర్ మల్లాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరియర్స్ విడుదలపై హర్షం

ఏయూ క్యాంపస్: విశ్వవిద్యాలయాల విశ్రాంత ఆచార్యులకు పీఆర్‌సీ, డీఆర్ అరియర్స్ విడుద ల చేయడంపై ఫెడరేషన్ ఆఫ్ రిటైర్డ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణలకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య ఇ.నాగభూషణరావు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



కృష్ణా కళాశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీయట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటర్ పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. లయన్స్ క్లబ్ సహకారంతో విద్యార్థులకు ఈ నెల 22వ తేదీ వరకూ నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులందరికీ భోజనం అందిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. ఈ మేరకు లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు సన్యాసినాయుడు, ఆర్.పి.నాయుడు, విమల, పుష్పలత, ఇందిర, లయన్స్ క్లబ్ ప్రతినిధులు చెరుకూరి శ్రీరామమూర్తి, చక్కా చందన పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదానికి గురైన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ కాలనీ శివాజీనగర్‌కు చెందిన కోనేటి నాగరాజు (27) స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఈ నెల 13న రాత్రి 9 గంటల సమయంలో జోడుగుళ్లపాలెంలో పెళ్లికి వెళ్తున్నారు. అదే సమయంలో జోడుగుళ్లపాలెం నుంచి హనుమంతవాక వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న మరో వ్యక్తి ఢీకొట్టాడు. ఈ ఘటనలో నాగరాజు తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో నాగరాజును వెంటనే స్థానికులు సహాయంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. అనంతరం ఆయన పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం నాగరాజు మృతి చెందాడు. దీనిపై ఎస్‌ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఏయూకు గుర్తింపుపై హర్షం

ఏయూక్యాంపస్ : అఖిల భారత స్థాయిలో ఏయూ 9వ స్థానంలో నిలవడంపై వర్సిటీ ప్రిన్సిపాళ్లు, డీన్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి, అభినందనలు తెలిపారు. విభిన్న రంగాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతూ జాతీయ స్థాయిలో అత్యుత్తమ వర్సిటీల్లో ఒకటిగా నిలపడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్‌లను వర్సిటీ ఆచార్యులు పెద్ద సంఖ్యలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణరావు, టి.శోభశ్రీ, డీన్‌లు ఆచార్య టి.షారోన్‌రాజు, ధనుంజయరావు, కె.బసవయ్య, విజయ్‌మోహన్, ఎస్.పుల్లారావు, యుగంధర్, పల్లవి, నాగరాజ, సోని, పావని, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మతల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న అక్కరమాని వెంకటరావు, తదితరులు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో కొలువుదీరిన బంగారమ్మతల్లి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అక్కరమాని ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు



సంపత్ వినాయక ఆలయం వద్ద కొబ్బరి కాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఆరిలోవ/బీచ్ రోడ్డు/ఏయూ క్యాంపస్: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆరోగ్యం బాగుపడాలని కోరుతూ జీవీఎంసీ పదో వార్డులో డెయిరీ ఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు చేశారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ఆమె కాలికి దెబ్బతగలడంతో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

➡ అక్కరమాని త్వరగా కోలుకోవాలని కోరుతూ మహిళా నాయకులు, బీసీ నాయకులు పోలమాంబ ఆలయం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పిల్ల సత్యవతి, బీసీ సెల్ అధ్యక్షుడు సూరాడ దాసు, కంచర్ల గాయత్రి, మత్స్యకార యువజన విభాగం నాయకులు ఉమ్మిడి కల్యాణ్, వాడమోదుల గణేష్ పాల్గొన్నారు.

➡ విజయనిర్మల కోలుకోవాలని పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో సంపత్ వినాయక, బంగారమ్మ తల్లి ఆలయాల వద్ద 108 కొబ్బరి కాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భవాని శంకర్, రాజు, కార్తీక్, వినయ్, జేమ్స్, శివ పాల్గొన్నారు.

డెంగ్యూ నియంత్రణపై ప్రజలకు అవగాహన అవసరం



ఆరిలోవ ర్యాలీలో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఇసుకతోట అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది

ఆరిలోవ: డెంగ్యూ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని మలేరియా అధికారులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ రెండో జోన్ పరిధి 13వ వార్డులో మంగళవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి మలేరియా సిబ్బంది ఖాళీ కొబ్బరి బొండాలు, టైర్లు, ఖాళీ సీసాలు, తదితర వాటితో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన పరిశీలించారు. అనంతరం ర్యాలీని కమిషనర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ నుంచి దుర్గాబజార్ వరకు సాగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. ఖాళీ కొబ్బరి బొండాలు, మూతలేని ఖాళీ సీసాలు లేకుండా చూడాలని, నీటి తొట్టెలు, పూల కుండీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఇంటిలో దోమ తెరలు వినియోగించడం మంచిదని ఆయన సూచించారు. సచివాలయాల పరిధిలో హెల్త్ సెక్రటరీలు ప్రతి ఇంటికి వెళ్లి జ్వర పీడిత బాధితులను గుర్తించి వివరాలు నమోదు చేయాలన్నారు. మలేరియా విభాగం సిబ్బంది దోమల నివారణకు నిత్యం వీధుల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్, మలేరి విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలపాలెం: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఇసుకతోటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇసుకతోట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హారిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయిక్ ప్రారంభించారు. అనంతరం ర్యాలీని ఇసుకతోట వరకు కొనసాగించారు. డెంగ్యూ, మలేరియా నివారణ చర్యలు సూచిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా మలేరియా విభాగం సిబ్బంది రత్నం, శేషు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, స్థానిక సహాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలనీ సంక్షేమ సంఘ కార్యకలాపాలపై పుస్తక రచన

మద్దిలపాలెం: రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (కాలనీ సంక్షేమ సంఘం) కార్యకలాపాల గురించి ఓ పుస్తకం రచించానని ఆంధ్రప్రదేశ్ కాలనీ సంక్షేమ సంఘాల విశాఖ జిల్లా సహాయ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.ఆర్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తకాన్ని హైదరాబాద్‌లోని కాలనీ సంక్షేమ సంఘాల ప్రధాన కార్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపరడానికి సమర్పించామన్నారు. 22 పేజీలు ఉండే ఈ పుస్తకం కాలనీ సంక్షేమ సంఘాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

వైఎస్సార్ ట్రస్ట్ సేవలు విస్తృతం కావాలి



మంత్రి కాకానితో సురేష్‌బాబు, సునీత

బీచ్ రోడ్డు: డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అందించే సేవలను విస్తృతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి సూచించారు. నగర పర్యటనకు వచ్చిన మంత్రిని ప్రభుత్వ అతిథి గృహంలో మంగళవారం ట్రస్ట్ చైర్మన్ కె.సురేష్‌బాబు, గంధం గ్రూప్ చైర్‌పర్సన్ సునీత్ కలిశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చేపట్టిన సేవల కోసం మంత్రికి వివరించారు. వేసవి కాలంలో అభాగ్యులకు అండగా నిలవాలని, వారికి మంచినీరు, ఆహారం అందించాలని కాకాని కోరారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- నేరాల నియంత్రణలో తోడ్పాటు అవసరం
- సమావేశంలో సీపీ త్రివిక్రమ్‌వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి: ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ హామీ ఇచ్చారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీ–1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (ఎస్‌బీ) గంగాధర్, ఏడీసీపీ (ట్రాఫిక్) అరీపుల్లాతో కలిసి నగర ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. అలాగే స్థానిక పోలీసులతో పూర్తి సమన్వయంతో నేరాల నియంత్రణ విషయంలో తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ–1 ఎం.జాన్‌మనోహర్, ట్రాఫిక్ ఏసీపీ–2 రాజీవ్‌కుమార్‌తో పాటు వివిధ ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థుల ఔదార్యం

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువతికి రూ.లక్ష సాయం



చికిత్స పొందుతున్న యువతితో మాట్లాడుతున్న ఆచార్య హరనాథ్

ఏయూ క్యాంపస్ : ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వర్సిటీ పూర్వ విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. వివరాలిలా ఉన్నాయి. గత నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన పందిరి అనూరాధ తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమె సుదీర్ఘ కాలం చికిత్స అందించాల్సిన అవసరం ఉంది. పేద కుటుంబానికి చెందిన అనూరాధ చికిత్సకు అధికంగా ఖర్చవుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు జి.ధర్మారావు, వై.గోపీచంద్‌లు తమ స్నేహితులు, బంధువుల నుంచి విరాళాలు సేకరించారు. ముందుగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అనూరాధను సోషల్ వర్క్ విభాగాధిపతి ఎస్.హరనాథ్ స్వయంగా కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులకు ఉపయుక్తంగా విద్యార్థులు సేకరించిన రూ 1,011,11ని బాధితురాలి తండ్రి రాముకు అందజేశారు. భవిష్యత్తులో సైతం అవసరమైన సహాయం అందిస్తామని చెప్పారు.

ఘనంగా ముగ్గురు అమ్మవార్ల పండగ



పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ



గొల్లలపాలెం గ్రామ దేవత పోలమాంబ

దాబాగార్డెన్స్: నగరంలోని 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ, 31వ వార్డు కృష్ణాగార్డెన్స్‌లో వెలసిన దుర్గాలమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

➡ పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ పండగ మహోత్సవాలు ఈ నెల 14న ప్రారంభమయ్యాయి. మంగళవారం అనుపుతో ఉత్సవాలు ముగిసాయి. ఆదివారం పండగ చాటింపు, 15న సోమవారం తొలేళ్ల ఉత్సవం, 16న ప్రధాన పండగ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో గరిడీలు, పులివేషాలు, తప్పెటగుళ్ల వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పితానిదిబ్బ, గొల్లలపాలెం, ప్రకాశరావుపేట, దిబ్బలపాలెం, భానోజీనగర్, కన్నయ్యపేట, విశ్వనాథం రోడ్డు, సింగ్‌హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

➡ గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం పోలమాంబ పండగ మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చాటింపు జరిపారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం, బుద్ధలవానిపాలెం, రామ్‌నగర్, నెహ్రూనగర్, ఆది ఆంధ్ర గ్రామం, అశోక్‌నగర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంత వాసులు పోలమాంబను ఆరాధిస్తుంటారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారిని సదుంపట్టు(ఆర్టీక్లబ్ గొల్లలపాలెం) నుంచి ధూప దీప నైవేద్యాలతో, బాజా భజంత్రీలతో తప్పెటగుళ్లు, చెక్కభజన, పులివేషాలు, సాము గరిడీలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. 23న మారువారం జరపనున్నారు. ఉత్సవంలో భాగంగా వచ్చే నెల 4న ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ అమ్మవారి కమిటీ ప్రతినిధులు తెలిపారు.

➡ జీవీఎంసీ 31వ వార్డు కృష్ణాగార్డెన్స్‌లో వెలసిన దుర్గాలమ్మ పండగ మహోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించారు. ప్రధాన పండగ మంగళవారం రోజున అమ్మవారికి విశేష పూజలు జరిపారు. కృష్ణా గార్డెన్స్, ప్రేమసమాజం ఏరియా, దాబాగార్డెన్స్, నారాయణవీధి, భానువీధి, లక్ష్మీవీధి, నీలమ్మ వేప చెట్టు ఏరియా తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

18న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 18న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని పేర్కొన్నారు.

ఫోర్త్‌టౌన్ వద్ద వ్యాన్ డ్రైవర్ల ఆందోళన

సీతమ్మధార: అక్రమ అరెస్టులు ఆపాలని కోరుతూ వ్యాన్ డ్రైవర్లు ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. జీవీఎంసీ జోన్–4, 5లో విధులు నిర్వర్తిస్తున్న 23 మంది వ్యాన్ డ్రైవర్లను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో డ్రైవర్లు భారీగా తరలివచ్చి స్టేషన్ వద్ద నినదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ అక్రమ అరెస్టులు ఆపాలని, డ్రైవర్లపై కేసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవోలు అమలు చేయని అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకుండా, న్యాయం చేయాలని అడిగిన వారిని అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. ఇదే వైఖరి కొనసాగితే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు.

రైల్వేకాలనీలో డీఆర్‌ఎం తనిఖీలు



రైల్వే కాలనీలో పర్యటిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం : రైల్వేకాలనీలలో అందుతున్న వసతులు, సదుపాయాలను తెలుసుకునేందుకు వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి మంగళవారం రాత్రి మర్రిపాలెం రైల్వే కాలనీలో పర్యటించారు. రైల్వే స్థలాల పరిరక్షణ, అనధికార వాహన పార్కింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్, అనధికార మతపరమైన నిర్మాణం గురించి ఆరా తీశారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాలనీవాసులకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీస్థలాలలో బారికేడ్లు ఏర్పాటుచేసి స్థలాలను పరిరక్షించాలన్నారు. కాలనీలో ఇతరుల పార్కింగ్‌ను కట్టడి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట సీనియర్ డివిజనల్ ఇంజినీర్(హెడ్ క్వార్టర్స్) ఎస్‌కే సారంగి, అసిస్టెంట్ ఇంజినీర్ కే నాగేశ్వరరావు, ఎలక్ట్రికల్, సివిల్ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.